క్లుప్తంగా

కుష్టు వ్యాధిపై అశ్రద్ధ తగదు

ముండ్లమూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత కోరారు. మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూరిమెట్లలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్ పాటు 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీమవరం, పూరిమెట్ల, మారెళ్ల, నూజిళ్లపల్లిలో నూతనంగా కనిపెట్టిన కుష్టు రోగులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మధుశంకర్, డీపీఎంవో సుబ్బారెడ్డి, రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



స్పీడు బ్రేకర్లకు తెల్లరంగు వేయిస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య

ముండ్లమూరు: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ యువీ కృష్ణయ్య తెలిపారు. దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమం నిర్వహించారు. ఉల్లగల్లు, రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలల వద్ద గల రహదారిలో స్పీడు బ్రేకర్లకు తెల్లరంగు వేయించిన అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: నమో వేంకటేశాయా నమో నమః అంటూ మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మి అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్

తర్లుపాడు: మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన గుమ్మా పెద్దచెన్నయ్య అనారోగ్యంతో విజయవాడలో గత 15 రోజులుగా వైద్య సేవల నిమిత్తం ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఆవుల రాజు విజయవాడ వెళ్లి పెద్ద చెన్నయ్యకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదును అందించారు. కుటుంబ అవసరాన్ని గుర్తించి వ్యయ ప్రయాసలకోర్చి విజయవాడ వచ్చి పింఛన్ అందించటంతో పెద్దచెన్నయ్య సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్ రాజును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ పిన్నిక శారద, వైస్ ఎంపీపీ కందుల సుజాత, ఎంపీడీఓ నరసింహులు అభినందించారు.

అవినీతిపై ఎమ్మెల్యే మద్దిశెట్టి ఆగ్రహం

● పల్లెవనం పార్కులో
రూ. 45 లక్షల అవినీతి



పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: పల్లెవనం పార్కులో ఇటీవల జరిగిన రూ.45 లక్షల అవినీతిపై ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణగోపాల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం టౌన్ పర్యటనలో భాగంగా శ్మశానాల ఆక్రమణలు పరిశీలించారు. వెంటనే ప్రహరీలు, ఇతర సెక్యూరిటీ, సౌకర్యాలు కల్పించాలని నగరపంచాయతీ కమిషనర్ మహేష్‌ను ఆదేశించారు. అనంతరం పల్లెవనం పార్కు పరిశీలించారు. పార్కులో అవినీతిపై అధికారుల ఎదుటే ఎమ్మెల్యేకు స్థానికులు, విలేకరులు ఫిర్యాదు చేశారు. అక్కడ పని చేస్తున్న వారికి జీతంలో సగం జీతం రూ.7500 మాత్రమే ఇచ్చి వేలు ముద్రలు వేయించుకుంటున్నారని, అవికూడా సంవత్సరం పూర్తి అయిన తరువాతే ఇస్తున్నారన్నారు. నాలుగు నెలలుగా ఎటువంటి పనులు చేయకుండా మూసివేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలాఖరులోగా పనులు మొత్తం పూర్తి చేసి లెక్కలు చెప్పాలని రేంజ్ అధికారి ఏవీ నాగేంద్రరావును ఆదేశించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేను నువ్వే పిలిపించావంటూ రేంజర్ నాగేంద్రరావు, స్థానికుల సమక్షంలోనే బీట్ అధికారి అమర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీట్ అధికారి కన్నీటి పర్యంతమై అక్కడి నుంచి వెళ్లిపోయారు.

లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పక్కన హీరోయిన్ హనీరోజ్, ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: పట్టణంలోని కాలేజీ రోడ్డులో శనివారం లక్కీ షాపింగ్ మాల్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, సినీమా హీరోయిన్ హనీరోజ్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని మార్కాపురం పట్టణంలో అతిపెద్ద గార్మెంట్స్ ఉన్న షాపింగ్ మాల్‌ను ప్రారంభించటం అభినందనీయమని నిర్వాహకులు శ్రీనివాస్, రత్తయ్య, స్వామిలను అభినందించారు. మంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఈ గ్రూపు వారు రాష్ట్రంలో తొమ్మిదో షాపింగ్‌మాల్‌ను మార్కాపురంలో ఏర్పాటు చేశారని మంచి క్వాలిటీ కలిగిన గార్మెంట్స్‌ను ప్రజలకు అందించటమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణంలో సుమారు రూ.600 కోట్ల రూపాయలతో ఇనార్బిట్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారని చెప్పారు. యజమానులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలో అందిస్తామన్నారు. హీరోయిన్ వీరసింహారెడ్డి ఫేమ్ హనీరోజ్‌ను చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు రావటంతో కాలేజీ రోడ్ కిక్కిరిసిపోయింది. లక్కీ గ్రూపు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ పి.కేశవరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, షంషేర్ అలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ, శ్రీనివాస్‌లతో పాటు పలువురు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు.

ఉచితంగా హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్‌లు అందజేస్తున్న ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు

కంభం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని స్థానిక ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా హెల్మెట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు హెల్మెట్ ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. తలకు హెల్మెట్ కవచం లాంటిదని, పోలీసులు ఫైన్ వేస్తారన్న భయంతో కాకుండా విలువైన ప్రాణాలు కాపాడుకోవడం కోసం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్‌లు పంపిణీ చేసిన అల్లూరయ్యను ఎస్‌ఐ అభినందించారు. అంబేడ్కర్ ఆశయ సమితి అధ్యక్షుడు కాటమాల అల్లూరయ్య, ఎంపీటీసీ ఆనంద్ ప్రదీప్, హుస్సేన్ బాషా, మధు, నవీన్ పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయం ఏర్పాటు



రిబ్బన్ కట్ చేస్తున్న సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి

దొనకొండ: పాఠకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సర్పంచ్ కొంగలేటి గ్రేస్ రత్నకుమారి దేవానంద్ తెలిపారు. శనివారం పాత పోస్టాఫీస్ దగ్గర నూతన గ్రంథాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ కొంత కాలంగా దొనకొండలో గ్రంథాలయం లేక పాఠకులు ఇబ్బంది పడుతున్నారని విషయం తెలుసుకుని ఏర్పాటు చేశామన్నారు. ఉప సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి, లైబ్రేరియన్ సుమతి, ఏసుబాబు, వార్డు మెంబర్లు బొందల రాజు, భట్టు, రామారావు, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మార్కాపురం రూరల్: గోగులదిన్నెకు చెందిన కూకట్లపల్లి గురవయ్య కుటుంబానికి దాతల సహకారంతో శనివారం సరుకులు అందజేశారు. గురవయ్య, మరియమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె శ్రావణికి బ్రెయిన్ క్యాన్సర్ రావటంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఇల్లు తాకట్టు పెట్టి రూ.8లక్షలు ఖర్చుపెట్టి శ్రావణికి ఆపరేషన్ చేయించారు. ఇంటివద్దే ఉంటూ కుమార్తె బాగోగులు చూసుకుంటున్నారు. దీంతో పూట గడవటం ఇబ్బంది ఉంది. హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య, అంజిరెడ్డి స్పందించి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను గురవయ్య కుటుంబానికి అందజేశారు. దాతలకు గురవయ్య, మరియమ్మలు కృతజ్ఞతలు తెలిపారు. దుర్గాప్రసాద్, సుబ్బా రామాంజనేయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పుల్లలచెరువు: జిల్లా అధికారుల ఆదేశాలపై శనివారం మండలంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనదారులకు అవగాహన కల్పించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, పిల్లలకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ప్రభుత్వం ద్వారా నిర్దేశించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. పత్రాలు సక్రమంగా లేని వాటికి జరిమానాలు విధించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

ప్రతి పాఠశాలకు ఆల్‌బెండజోల్ మాత్రలు



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని ప్రతి పాఠశాలకు నులిపురుగు నివారణ మాత్రలను అందుబాటులో ఉంచాలని.. డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని దారంవారిపాలెం, తూర్పుగంగవరం, తాళ్లూరులో శనివారం పర్యటించారు. దారంవారిపాలెంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఆల్‌బెండజోల్ మాత్రలను అందుబాటులో ఉంచుకొని ప్రతి విద్యార్థికీ వేయాలన్నారు. ఈ నెల పదో తేదీన నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా సిబ్బంది అన్ని పాఠశాలలో విధులు నిర్వహించాలన్నారు. వైద్యాధికారులు ఎస్.కె ఖాదర్‌మస్తాన్‌బీ, రత్నం, సిబ్బంది శ్రీనివాస్, మంగాబాయి, మేరీ, ప్రేమలీల, బాల సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం నాగిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకట రమణ

బేస్తవారిపేట: విత్తనాలు విక్రయించే డీలర్లు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని వ్యవసాయశాఖ కనిగిరి ఏడీఏ, విత్తనాల ఇంటర్నల్ స్క్వాడ్ వెంకట రమణ సూచించారు. శనివారం స్థానిక బస్టాండ్, జంక్షన్‌లో విత్తనాల అమ్మే ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. డీలర్స్ దుకాణాల్లో స్టాక్‌బోర్డు, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. డీలర్లు బిల్లులు లేకుండా, లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ కంపెనీలకు చెందిన రూ.5.40,189 విలువ కలిగిన విత్తనాలు, పీసీలు లేకపోవడంతో అమ్మకాలు నిలుపదల చేశారు. ఏఓ జక్కం మెర్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సునీతాబ్రహ్మారెడ్డి

ముండ్లమూరు: ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయడంలో మండల స్థాయి అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను అర్హతగల ప్రతి పేదవాడికీ అందజేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా చూడాలని, తాగునీరు అన్ని గ్రామాలకు అందేలా చూడాలన్నారు. 75 మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అనంతరం వివిధ శాఖల పని తీరును, ప్రగతి వివరించారు. శింగనపాలెంలో అంగన్‌వాడీ కేంద్రానికి తాగు నీరు రావడం లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలుపగా.. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు మాట్లాడుతూ వారం రోజుల్లో నేనే సమస్యను పరిష్కరిస్తానన్నారు. మక్కెనవారిపాలెంలో పాఠశాల భవనం లేదని సర్పంచ్ వెంకటేశ్వర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, ఎంపీడీఓ హనుమంతరావు, పంచాయతీరాజ్ డీఈ విఠల్‌రాథోడ్, వైస్ ఎంపీపీలు పద్మజానకి రామయ్య, బంకా రమణమ్మ నాగిరెడ్డి, ఏఓ ఫరూక్, వైద్యాధికారులు జ్యోతి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. కాగా సర్వ సభ్య సమావేశానికి ఆ శాఖ అధికారులెవ్వరు హాజరుకాకపోవడం పట్ల ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. వారు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్ల ప్రారంభోత్సవానికి హాజరు కావాలి

దర్శి: నియోజకవర్గంలోని దొనకొండ రైల్వే స్టేషన్‌ల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి కోరారు. స్థానిక ఆదిత్య గ్రాండ్‌లో బీజేపీ నాయకులతో మాట్లాడుతూ దేశంలో 56 రైల్వేస్టేషన్‌లు ఆధునికీకరణ చేసి.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఒంగోలు, శింగరాయకొండ కూడా ఉన్నాయని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, కార్యవర్గ సభ్యులు సెగ్గం శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు, కిసాన్‌మోర్చా అధ్యక్షులు ఉన్నం శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు జేష్టాది ఆంజనేయులు, లీగల్ సెల్ కో కన్వీనర్ బసవేశ్వరరావు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందనలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: ఒంగోలులో జరిగిన కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–4లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థినీ, విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలతో మెరిశారు. వీరికి శనివారం ఎంఈవో పి.ఆంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం కె.రమాదేవి, ఎన్‌సీసీ అధికారి కాకర్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని అభినందించారు. గత నెల 22 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ క్యాంపులో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 9 బెటాలియన్‌ల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 34వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలను సాధించారు. షేక్ అనీషా నీలోఫర్ సాంస్కృతిక పోటీల్లో బంగారు, టగ్ ఆఫ్ వార్‌లో వెండిపతకం, బొందిలి గాయత్రి షూటింగ్‌లో వెండి పతకం, నవ్య శ్రీ, చరిత, డి.కాశింబీ, కోలా ఉమాశంకర్, సువర్ణరాజు టగ్ ఆఫ్ వార్‌లో వెండి పతకాలు, ఎనిబెర జాన్‌వెస్లీ, పవన్‌కుమార్ డ్రిల్‌లో వెండి పతకాలు సాధించారు. పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడర్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎంఈఓ సూచించారు.

ఆపరేటర్లు ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాలి

పుల్లలచెరువు: రేషన్ ఇచ్చే వాహనదారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాలని తహసీల్దార్ దాసు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రేషన్ ఆపరేటర్లు ఇళ్ల వద్దకు వెళ్లడం లేదని, తప్పని సరిగా వలంటీర్ల సహకారంతో ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సకాలంలో లబ్ధిదారులకు రేషన్ అందజేయాలని సూచించారు.

తల్లిపాలు అమృతంతో సమానం



వాగుమడుగులో పౌష్టికాహార కిట్లు అందిస్తున్న అధికారులు

పొదిలి: తల్లిపాలు అమృతంతో సమానమని ఉడుముల హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి అన్నారు. శనివారం ఉడుముల హాస్పిటల్స్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన గీతికారెడ్డి మాట్లాడుతూ తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ పోషణ సంపూర్ణ కిట్లు అందజేయటం అభినందనీయమని వాగుమడుగు సర్పంచ్ బూదాల కమలాకర్ అన్నారు. శనివారం వాగుమడుగు అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. 11 రకాల పదార్థాలతో కూడిన పోషక కిట్లను అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు శ్రీకారం చుడతాయని సీడీపీఓ సుధామారుతి తెలిపారు. కేంద్రాల్లోని పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు.

ఉపాధ్యాయుల నిరసన

గిద్దలూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావుకు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, రీ అపోర్షన్ ద్వారా సర్దుబాటు జరిగిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులు వంటి సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు శోభన్, సలీంబాష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.